# దేవుడెక్కడున్నాడు?



"నిరంజన్! నువ్వు వ్రాసిన కథ చదివానోయ్. చాలా బాగుంది. చక్కని రచయితకాగల లక్షణాలు నీ రచనలో ప్రతిబింబిస్తున్నాయి. నవ్వూ, నా ముసిలిడొక్కు కబుర్లనూ కూడా ఎప్పుడో ఒకనాడు పత్రికల్లో కెక్కించేస్తావేమోనని భయంగా ఉంది!" అంటూ ముసిముసిగా నవ్వారు సర్వేశ్వరరావుగారు.

ఆయన వయస్సు తొంభై రెండు సంవత్సరాలు. విద్యావయోవృద్ధులైన ఆయనతో సంభాషిస్తూంటే నాకదే ఒక గ్రంథపఠనంలా ఉంటుంది. ఆయన సాంగత్యం నన్నొక మంచి రచయితగా తీర్చి దిద్దగలదన్న నమ్మకం ఉంది నాకు.

"ఏమో! మీ మాటలే మంత్రాలు, మీ కబుర్లే కథలుగా తోస్తాయి నాకు. మీ నోటితో ఏదంటే అది అయితీరుతుంది. మీ ఆశీర్వాదం, దైవసంకల్పం నన్ను రచయితగా నిలబెట్టటానికే అయితే నాకంత కంటే ఏం కావాలి?" అన్నాను.

అంతసేపూ వాలుకుర్చీలో పడుకున్న ఆయన చిన్న కుర్రాడిలా చలాకీగా ముందుకు ఒరిగి "దేవుడెక్కడున్నాడోయ్?" అని, టక్కున అడిగారు. నేను కొంచెం తికమకపడి, ఏమిటి చెప్పడమని ఆలోచించాను. ఏమీ తట్టలేదు. చివరకు "ఇందుగల డందులేడని' పద్యం జ్ఞాపకం వచ్చింది. కాని, తీరా చదివితే "కాటేసన్నేవడిక్కావాలోయ్, భక్త ప్రహ్లాదా! నీ ఉద్దేశ్యమేమిటో చెప్పు!" అంటారేమోనని కాస్త తటపటాయించి "దేవుడా అండీ. . . దేవుడా. . . మరే" అని కొంచెం నసుగుతూంటే "అవునోయ్! అదే, దేవుడేఎక్కడున్నాడూ? అనిఅడుగుతున్నాను. రచయితగా అధమం ఒక గడుసు సమాధానమయినా చెప్పలేవూ?" అన్నారు మరి కొంచెం బిరుసుగా నవ్వుతూ.

నాకు వెర్రిముఖం పెట్టక తప్పలేదు. రచయితగా నన్నాయనకు పరిచయం చేసుకున్నందుకు నన్ను నేను మనసులోనే తిట్టుకుంటూ "పెద్దవారు. మీరే చెప్పాలి"! అనేశాను అదే గడుసుదనం అనుకుని.

ఆయన మరొకసారి బోసినోరు వెళ్లబెట్టి నవ్వుతూ "సరే అయితే నీకు కావలసిన సమాధానానికి నేను నా జీవితానుభవం ఒకటి చెబుతాను. చెప్పాక దేవుడెక్కడున్నాడో నీకే తెలుస్తుంది" అంటూ మరలా వెనక్కి వాలారు.

ఆయన జీవితంలో జరిగిన సంఘటనలూ, అనుభవాలూ వింటూంటే వాటిముందు నా రచనలు దిగదుడుపనిపిస్తాయి నాకు! ఆ కబుర్లే అలా వింటూ కూర్చోవాలనిపిస్తుంది.

"చెప్పండి"! అన్నాను ఉత్సాహంగా.

ఆయన ఇలా చెప్పటం ప్రారంభించారు:

అదొక కొండప్రాంతం. ఎటు చూసినా మకర తోరణాల్లా కొండవరసలే కనుపించేవి. అక్కడొక పెద్ద జలపాతం ఉంది. ప్రభుత్వం అక్కడొక విద్యుచ్ఛక్తి కేంద్రాన్ని నెలకొల్పాలనీ, కొండతవ్వి రైలుమార్గం వెయ్యాలనీ సంకల్పించింది. మరొక ఇద్దరు బ్రిటిష్‌ఇంజనీర్లతోపాటు నన్నుకూడా అక్కడికి పంపి, అక్కడున్న కొండజాతివారితో మాత్రం జాగ్రత్తగా మసలుకోమనీ, హంటర్ని దగ్గిరఉంచుకోవడం సర్వదా శ్రేయస్కరమనీ సూచించింది.

ప్లానింగ్ పూర్తిఅయి పని ప్రారంభమయింది. ఎన్నో వందల మంది కూలీలతోపాటు కొందరు కొండవాళ్ళుకూడా కలిసి పని చేస్తున్నారు. ఆ ప్రదేశం నా కెంతో రమ్యంగా కనిపించింది. దూరాన ఎత్తయిన జలపాతము, గలగలలాడుతూ అల్లరిపిల్లలా పారుతూన్న సెలయేరు, రేఖాచిత్రంలా కనుపిస్తూన్న కొండవరస చూస్తూ ఎంతోకాలం గడిపేవాణ్ణి.

ఒక నాడలాగే ఆ ప్రకృతి సౌందర్యాన్ని తనివితీరా చూస్తూ, సెలయేటి గలగలలకు కాలిబొటనతో చిన్నగా లయవేస్తూ, ఆనందపరవశుడనై కూర్చున్నాను. లయబద్ధంగా ఏదో పాట ప్రారంభమయింది. అంతలోనే కాలుతో అలా కొడుతూనే ఆశ్చర్యంగా నలుదిక్కులా కలయచూశాను నేను.

కూడా ఇలాంటి అన్యాయాలు చేస్తూంటే నీ దైవత్వమేమిటి?" అని కొద్దిగా ఆవేశపడింది.

బొమ్మ ఉలకలేదు పలకలేదు. పసుపుకుంకుమలతో పుర్రెలదండలతో మరింత భయంకరంగా, వికృతంగా కనిపిస్తూంది.

"ఏం మాట్లాడవేం? నీ కంటే నేనే నయంలా ఉన్నాను. నాకు జాలయినా ఉంది సాటిప్రాణిమీద?" అని గద్దించింది. బొమ్మలో మార్పేమీ రాలేదు. మూనాకు ఒళ్ళు తెలియని కోపం వచ్చేసింది. "నువ్వు నిజంగా దేవతవు కావు. వట్టి బొమ్మవి. లేకపోతే నే నిన్నిమాటలన్నందుకు పౌరుషమయినా రాదా? సిగ్గయినా వెయ్యదా?" అంది హేళనగా నవ్వుతూ. బొమ్మ చలించలేదు. "మా వాళ్ళంతా వట్టి మూర్ఖులు. నిన్ను దేవత అనుకుని పూజిస్తున్నారు. పోపో ఈ నాటితో నీ పస బయట పడింది" అని చరచరా నడిచి బయటికి వచ్చేసింది.

ముసలిపూజారి గుడికివస్తూ ఎదురయ్యాడు. "తాతా దేవుడెక్కడుంటాడు?" అని ఆత్రంగా అడిగింది మూనా. గుడివైపు వేలితో చూపుతూ "అక్కడే!" అన్నాడు తాత.

"ఛీ అది ఉత్తబొమ్మ. నిజంచెప్పు. మనతో మాట్లాడే దేవుడు "ఎక్కడున్నాడు?" అని వేధించింది. ఎంతసేపు చెప్పినా ఆ బొమ్మ దేవుడంటే వినడంలేదు. తాతకి విసుగువచ్చి మనకు చాలా దూరంగా ఉంటాడన్నాడు. ఎక్కడో చెప్పు నేను వెళతాను" పట్టుదలగా అంది మూనా.

ఎలాగా వెళ్ళలేదుకదా అని "ఆ కొండలవతల ఉంటాడు" అని చెప్పాడు తాత.

"నిజంగానా?" ఆశ్చర్యపడింది మూనా.

"అయితే నే నక్కడకు వెళ్ళలేనుకదా నాకు కనిపించడా?" అని కళ్ళనీళ్ళు కుక్కుకుంది. ఆమె అమాయికత్వానికి జాలి పడుతూ "లేదు. లేదు. మనం ఎవ్వరం వెళ్ళనక్కరలేదు. ఎప్పుడో ఒకనాడు తానే ఆ కొండలెక్కి మన దగ్గరికి వస్తాడు" అని వెళ్ళిపోతూంటే "ఎప్పుడు వస్తాడో చెప్పవూ?" అని బ్రతిమాలడం మొదలెట్టింది మూనా.

'ఎప్పటికీ వదలదేమిటీ పిచ్చి పిల్ల' అనుకుని కొద్దిగా చిరాకు పడుతూ "ఏమో ఏ క్షణాన్నయినా రావచ్చు చూస్తూండు" అనేసి వెళ్ళిపోయాడు.

ఆ రోజునుంచీ మూనాకు మరొక ఆలోచన, ఆటాపాటాలేదు. ఆకలి వేసినప్పుడేదో ఇంత తినెయ్యడం కొండలవైపు చూస్తూ చీకటి పడేవరకూ ఆ సెల యేటిగట్టున కూర్చోవడం ఇదే ఆమె దినచర్య అయింది. చీకటిపడిపోయిన తరవాత విచారంగా గుడిసె చేరుతూండేది.

'ఒక రోజు దేవుడు తప్పక వస్తాడు. తన జాతి వారందరిని సన్మార్గులను చేస్తాడు. చక్కని బ్రతుకు తెరువు చూపి కొండల అడ్డు తొలగించి బయట ప్రపంచంలోనికి దారి చూపుతాడు' అని ఆమె ఆశ. బందాతల్లి పిచ్చెత్తింది. ఒక్కొక్కప్పుడు ఏటి ఒడ్డున అదేపనిగా కూర్చుని బందాను పిలుస్తూ ఏడుస్తూండేది. ఆ దృశ్యం చూసేసరికి మరింత కెలికినట్లయ్యేది మూనాకు.

మూనాకు పదహారేళ్ళ ప్రాయం వచ్చింది. వింత వింత సొగసులీనుతూ, కాంతిరేఖలతో తళతళలాడ వలసిన ఆమె వదనంలో రోజుకొక కళ తరిగి పోతూన్నట్లుంది. ఆరేళ్ళ నుండి నిత్యం ఎదురుతెన్నులు చూస్తున్నా ఏ దేవుడూ రాలేదు.

బందాతల్లి ఒకనాడు ఏటిఒడ్డున కూర్చుని బందా కోసం ఏడ్చిఏడ్చి ఆ ఉన్మాదస్థితిలో ఒళ్ళు తెలియక ఏట్లోపడి చచ్చిపోయింది. ఆ సంఘటన మూనా మనస్సును మరింత బాధ పెట్టింది. "అమాయికులు అంతా బలిఅయిపోయేవరకు రావేమిటి?" అని ఏడుస్తూండేది. కాలవగట్టున కన్నీరు సెలయేటిలో పడి బండలమీదనించి జారుతూంటే, విషాదగీతం ఆలపిస్తూండేది,

"యుగయుగాల కన్నీళ్ళ జలపాతాలేమో!
కరకురాతి గుండెలో కొండవరుసలేమో!
కొండలన్ని కరిగించి బందీలను విడిపించి
బ్రతుకుతెరువు చూపించే దేవుడెప్పుడొస్తాడో"

అంటూ.

అరణ్యరోదనం అన్న మాట సార్థకమయిందే తప్ప దైవదర్శనం కాలేదు. మానసికంగా ఆమెను నిరాశ, నిస్పృహ ఆవరిస్తున్నాయి. కాని తాత చెప్పిన మాటమీద గురిపోలేదు. 'తన మొరలను వినగా దేవునికి తప్పక జాలి కలుగుతుంది' అనే ఆశ పోలేదు. రోజురోజుకీ గూడెంలో ముష్కరుల క్రూరకృత్యాలు


జీర్ణకోశము నందు కలుగునట్టి
ఒడుదొడుకులు
మా జోలికిరావు!

ఏలయన మేము ఈ మధ్య ఫిలిప్స్ మిల్క్ ఆఫ్ మెగ్నీషియాను వాడుట ప్రారంభించినాము.

ఆధునిక శాస్త్రమునకు ఎరుకపడిన మేటి ఔషధములలో ఫిలిప్స్ మిల్క్ ఆఫ్ మెగ్నీషియా ఒకటి—సుకుమారమైన జీర్ణకోశమున పుట్టు అధిక అమ్లమును త్వరితముగాను, సంపూర్ణముగాను, సురక్షితముగాను హరించుటయేగాక ఫిలిప్స్ మిల్క్ ఆఫ్ మెగ్నీషియా మీకు అప్పుడప్పుడు కలుగు అజీర్ణము, మందాగ్ని, గొంతుకు మంట లేక పైత్యమునుండి ఉపశమనము కలిగించును—ఇటువంటి మేటి ఔషధము మీ ఇంట లేకుండ ఉండవద్దు — సురక్షితమైనది. నమ్మదగినదియైన ఫిలిప్స్ మిల్క్ ఆఫ్ మెగ్నీషియా మీ కుటుంబములోని వారందరికిని ఉపయోగపడును.


ఫిలిప్స్ మిల్క్ ఆఫ్ మెగ్నీషియా మలబద్ధకమును నాజూకుగాను, పూర్తిగాను నివారించి, మీ జీర్ణకోశమును క్రమపద్ధతికి తీసికొనివచ్చి మీకు హాయిని కలిగించును.



ఫిలిప్స్
మిల్క్ ఆఫ్ మెగ్నీషియా




మాన్యుఫాక్చరర్ : రిజిస్టర్డ్ యూజర్ : డేస్ మెడికల్ స్టోర్సు (మాన్యుఫాక్చరింగ్) ప్రైవేట్ లిమిటెడ్
88 ఇండెన్ రోడ్డు, కలకత్తా-19



lem MH 10 TL

మితిమీరిపోతున్నాయి. క్రౌర్యాన్ని అణచగల దైవశక్తి కోసం ఆమె అహర్నిశలూ పరితపిస్తూ దైహికంగా శుష్కించి పోతూంది. మేకను బలి ఇవ్వకపోవటం చేతనే మూనాకు అనారోగ్యం సంభవిస్తూందని దేవత కన్నె శాంతులు చేస్తున్నాడు దొర.

వసంతఋతువు వచ్చింది. మోడులన్నీ చిగురించాయి. ఎండిన బీడు మాదిరి బీటలువారింది ఆమె హృదయం. ఆ రోజు కూడా యథాప్రకారంగా శుష్కించిన కనుగవతో కొండ శిఖరాలను చూస్తూ కూర్చుంది. చుట్టూ ఉన్న కొండలు ఇనుప గొలుసుల్లా కనిపించాయి.

ఇంతలోనే కొండ అంచున ఏవో ఆకారాలు మెదిలినట్లయ్యాయి. కనులనీరు తుడుచుకుని లేచి నిలబడి, విస్ఫారిత నేత్రాలతో మరోమారు చూసింది. సందేహం లేదు. ఎవరో, ఇద్దరు మనుష్యులు కొండ దిగివస్తున్నారు. 'దేవుడు! దేవుడు!' అనుకుంటూ ఎదురు పరుగు ప్రారంభించింది మూనా.

ఈ కొండజాతి అక్కడ ఒకటి ఉందని అంతవరకు ఎవ్వరికీ తెలియదు. ముగ్గురు మనుష్యులొక్కసారి దొరచేతిలో చావగానే ఇదేదో పిశాచాలవని అని హడలిపోయి ఎవ్వరూ అటు రావడం మానుకున్నారు. కాని పట్నంలో చదువుకుని వచ్చిన జమీందారు బిడ్డ కుమార్ ఒక అనుచరుణ్ణి తీసుకుని కొండ ఎక్కి ఆ వెనక ఏముందో చూద్దామని సాహసించాడు. కొండ ఈవలిపక్కనించి అంత ఎత్తుంటే దాని ఆవలి వైపు చాలా మెరకప్రదేశం. గంటసేపట్లో దిగిపోయారు. దూరాన్నించిచిన్నచిన్న గుడిసెలన్నీ కలిసి ఒక గుంపుగా కనిపించాయి. 'ఇక్కడెవరో నివాసం చేస్తున్నట్లున్నారు. కొంపతీసి దొంగలయి ఉండరుకదా' అని కొంచెం భయపడుతూ తుపాకులను సిద్ధంగా చేత పట్టుకుని ముందుకు వస్తున్నారు.

మూనా పరిగెత్తుకుని వెళ్లి ఆయాసపడుతూ ఇద్దరినీ పరికించి బాగా చూసి ఎత్తుగా, దృఢంగా, గంభీరంగా రాజకళలుట్టిపడుతూన్న కుమార్‌ని చూసి "దేవుడా, ఎన్నాళ్లకు వచ్చావు!" అంది సంతోషంతో పులకించి పోతూ.

వచ్చినవారిద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు. కుమార్ మాట్లాడకపోవటం చూసి "మాట్లాడవేం? పోనీ మెడలో పుర్రెల దండలవీ వెయ్యాలేమోచెప్పు మా మూనాకి లాగ" అంది దీనంగా.

పుర్రెలపేరు వినగానే కుమార్ అనుచరిడి కాళ్లు దడదడలాడటం మొదలెట్టాయి. "పిచ్చిదేమోనండి! వెనక్కిపోదాం పదండి. నా మాట విని, కోరి ముప్పు తెచ్చుకోకండిక్కడ" అని బ్రతిమాలాడు.

"ఛథ! ఏమిటా మాటలు? ఈ అమ్మాయికన్న పిల్ల మనసేం చేస్తుంది? తొందరపడకు. ఏం జరుగుతుందో చూద్దాం" అని మూనావైపు తిరిగి ఇలా అన్నాడు కుమార్.

"అమ్మాయ్! నువ్వెవరో మాకు తెలియదు! నన్ను దేవుడంటావేమిటి? నేనూ నీలాంటి మనిషినే!"

మూనాకు దుఃఖం పొంగిపొంగి వచ్చేసింది. 'ఇన్నాళ్ల నుంచి తానెదురు చూస్తూంటే కళ్లుకాయలు కాచిపోతూంటే, తీరావచ్చి నేను దేవుణ్ణి కాదు పొమ్మంటున్నాడేమిటీ దేవుడు?' అని పసిదానివలె ఏడుస్తూ

మధ్యలో వస్తూన్న చెక్కుల నావుకుంటూ "దేవుడా నన్ను మోసం చేస్తావా? ఎన్నో సంవత్సరాల తరబడి నీ కోసం ఎదురు చూస్తున్నానే! నీకు నా మీద జాలి లేదా? కొండెక్కి ఒకనాడు దేవుడు వస్తాడని తాత చెప్పినమాటే అబద్ధమంటావా?" అంది దీనాతి దీనంగా.

మూనాను చూస్తూంటే కుమార్‌కి చాలా జాలి వేసింది. 'ఎంత అమాయికత్వం? ఈ కాలంలో కూడా ఇలాంటి వాళ్ళున్నారా?' అని ఆశ్చర్యపోతూ అనుచరుడికి కొద్దిగా ఊరుకో అన్నట్టు సంజ్ఞచేసి, మూనాతో "ఏడవకు నేను దేవుణ్ణే! ఏం చెయ్య మంటావో చెప్పు!" అన్నాడు.

మూనాకు పరమానందమయింది. కుమార్‌కు సాష్టాంగపడి "దేవుడా మా గూడెం వాళ్లంతా వట్టి మూర్ఖులు. దేవత, దేవత అని ఆ బొమ్మను పట్టుకుని ఏడుస్తూ బలులు బలులంటూ రక్తతర్పణాలు వదులుతున్నారు. మా నాన్న, మరికొందరు బలవంతులూ కలిసి అమాయకుల్ని నానా బాధలూ పెడుతున్నారు. మేకపిల్లను వదిలిపెట్టినందుకు కోపించి, మూనా బందాను బలికోరిందని నాతో అబద్ధం చెప్పి, అనవసరంగా, నిర్దయగా చంపేశారు వాణ్ణి. పాపం, మూనా బొమ్మకు మాటలే రావు! ఎలా అడుగుతుంది వీరిని? నువ్వుచెప్పు" అంది.

ఏమనాలో తెలియక "అసలు బొమ్మెక్కడైనా మాట్లాడుతుందా?" అన్నాడు కుమార్.

"మరి ఈ సంగతే మా వాళ్లతో చెప్పి, ఒప్పించి, వాళ్ళందర్నీ మంచిగా మార్చి, ఈ కొండల అడ్డు తొలగించి మమ్మల్ని బయటికి తీసుకువెళతావా?" అంది ఆశగా మూనా.

మూనా చెప్పిన మాటలతో అక్కడ కసాయి వాళ్ల లాంటి మనుషున్నారని తెలిసి తామక్కడ కనిపిస్తే వాళ్లేమైనా ప్రమాదం తలపెడతారేమోనని కొంచెం జంకి "నువ్వు చెప్పినట్లే చేస్తాను. దుండగీడుల పని పట్టించి, మిగిలినవారు సుఖపడేలా చూస్తాను. నువ్వు వెళ్లిపో" అని మూనాతో చెప్పి, "ప్రభుత్వానికీ సంగతి వెంటనే తెలియజేయాలి పోదాం" అని అనుచరితో చెబుతూ ఇంకా వెనుతిరగలేదు, ఎక్కడనుండో పెద్ద గోల వినిపించింది.

ఈటెలూ, బల్లాలూ పట్టుకుని ఒక దండు వాళ్లవైపు పరిగెత్తుకు వస్తూంది. అందరికంటే ముందున్న దొర "మనిషి—మనిషి" అని గట్టిగా అరుస్తున్నాడు. కుమార్, అనుచరుడూ దిగ్భ్రాంతు లయ్యారు.

మూనా నవ్వుకుంటూ ఆ దండుకు ఎదురుగా వెళ్లి "మనిషికాదు, దేవుడు! మనల్ని ఉద్ధరించ టానికి వచ్చాడు" అంది. వాళ్లామెను లక్ష్యపెట్టకుండా ముందుకురుకుతున్నారు. కుమార్ అనుచరుడూ హడలెత్తిపోయి గచ్చతుప్పల వెనక దాగున్నాడు.

కుమార్ ఎందుకైనా మంచిదని తుపాకీతీసి చేత పట్టుకుని "ఆగండి! ఏమిటా మూర్ఖత? నేనూ మనిషినే మీరూ మనుష్యులే"! అన్నాడు శాంతంగానే, ఉద్రేకాన్ని అణుచుకుంటూ.

"దానితో వాళ్ళు మరీ రెచ్చిపోయారు. "ఆ ఎడడివిరా నువ్వు మమ్మల్ని మనుషులంటున్నావ్! మేం దేవతలం! మూనాదిడ్డలం నిన్నేం చేస్తామో చూడు" అని నలుగురూ బల్లాలు పట్టుకుని కుమార్‌కి గురిపెట్టి విసరబోయారు. కుమార్ ఒక్క సారి లంఘించి గుంపుదాటివచ్చి తుపాకీ గురిపెట్టి వరసన ఆరుగుర్ని కొట్టాడు. మూనా ఒక పక్క విలపిస్తూ పెడుతున్న గోల ఎవరూ వినలేదు.

చివరకు కుమార్ తూటాలన్నీ అయిపోయిన ఖాళీ తుపాకీతో నిస్సహాయంగా వారికి దొరికిపోయాడు. కసితీరా అతన్ని పొడిచి పొడిచి చంపారా దుర్మార్గులు.

మూనాకళ్ళు నిప్పుకణాల్లా మెరిశాయి. పళ్ళు పటపట కొరుకుతూ ఉగ్రరూపం చూపిస్తూ, అపరదుర్గాదేవిలా లేచి ముందుకు వచ్చి "పిశాచాల్లారా, మీ క్రౌర్యంతో ఈవాళ నా కనులంట రక్తమే ప్రవిస్తూంది. భుగభుగమండుతూన్న ఈ హృదయంలో నించి వస్తూన్న ప్రతిమాటా జరిగి తీరుతుంది చూడండి! కొండలవలె కండలు పెంచి గుండెలు బాదుకుంటూ యోధులమని ముందుకు వచ్చిన రాక్షసుల్లారా! రేపీపాటి వేళకు మీగతి ఏం పడుతుందో చూడండి!

"మీ శరీరాలు తుండెలై ఎగిరి మీ రక్తంతో ఈ బండరాళ్ళు తడిసిపోవాలి. మీతో క్రూరత్వం అంత రించాలి. మంచివారంతా సుఖపడాలి, వెలుగుబాట రావాలి. ఇది మూనాశాపం,వరంరెండు—అనుభవించండి" అంటూ బాకుతో గుండెల్లో పొడుచుకుని కింద పడిపోయింది.

"కన్నుల ఎదట జరిగిన ఘోరాన్ని చాటునుండి చూస్తూన్న కుమార్ అనుచరుడు గుండెలు చేత పట్టుకుని ఎలాగో పారిపోయాడు. మరునాటికల్లా ఈ వార్త ప్రభుత్వానికి తెలిసిపోవటం, సాయంసమయానికల్లా సాయుధబలాలన్నీ కొండల నధిగమించి గూడాల్ని చుట్టుముట్టటం జరిగింది. వారిలోని ముష్కరులంతా ముందుకు వచ్చి చచ్చే వరకూ పోరాడారు. కాని తుపాకులధాటికి వారి ఆయుధాలు తట్టుకోలేదు.

మూనా చెప్పిన ప్రకారమే వారిరక్తం ధారలు కట్టి రాళ్లవిగాదనించి ప్రవహించింది. దొరతోసహా వారిలోని దుష్టులందరూ మరణించారు. మిగిలిన వారికి ప్రభుత్వం "అందరితోపాటే మిమ్మల్నీ చూస్తా"నని హామీ ఇచ్చింది. కొండలన్నీ రోడ్లు వేయించారు. ప్రకృతిసంపదను ప్రజల కందుబాటులోనికి తెచ్చే ప్రయత్నాలు జరిగాయి.

"విద్యుచ్ఛక్తికేంద్ర నిర్మాణం ప్రారంభమైంది. మీరు ఇంజనీరుగా వచ్చారు. ఇక మీకు తెలుసుగా!" అంటూ గోవింద్‌దాస్ కథ పూర్తిచేశాడు. మూనా కథ పూర్తిగావిన్న నాకు ఒళ్లంతా వేడెక్కి కళ్ళు చెమర్చాయి.

"సాబ్! మా కుమార్‌బాబును చంపినందుకు పగతీర్చుకున్నానులెండి" అంటూ గర్వంగా మీసాలు మెలిపెడుతూ నవ్వాడు గోవింద్.

"ఏమిటీ కుమార్‌తో వచ్చినవాడివి నువ్వా?" అంటూ తెల్లబోయాను నేను. మందంగా తలాడించా డతను.

"నిరంజన్! విన్నావుకదుటోయ్ నా అనుభవ [illegible] పూరితమైన కథ అంతా! అయితే దేవుడెక్కడున్నాడో తెలిసిందా? ఇప్పుడైనా?" అంటూ చెమర్చిన కళ్లను కండువాతో ఒత్తుకుంటూ, బింకం చెడకుండా నవ్వుతూ అడిగారు సర్వేశ్వరరావుగారు.

నేను మాట్లాడే స్థితిలో లేను. నేను విన్న మూనా కథతో నా మస్తిష్కం ఎన్నో దశాబ్దాల వెనక్కి వెళ్లింది. ఆ అనుభూతులన్నీ కలిసి నన్ను అవాక్కృతివును చేశాయి.

"చెప్పవోయ్ నిరంజన్!" అంటూ కుదిపారాయన.

నా కనులంట రెండు వెచ్చని కన్నీటిబిందువులు జారాయి "తెలిసింది. . . దేవుడున్నాడు. . . నమ్మకంలో . . . ఆత్మవిశ్వాసంతో" అనగలిగా నెలాగో.

అవునన్నట్లు సర్వేశ్వరరావుగారు మందంగా తల ఆడిస్తూంటే 'సత్యం' అంటూ గుడిగంటలు మోగాయి. ☆

